**ప్రజల మాట ప్రగతి బాట**

# మానకొండూర్ నియోజకవర్గం



మానకొండూర్/ రూరల్ : బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రం




మానకొండూర్/రూరల్: ముంజంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

# పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు






శంకరపట్నం/ తిమ్మాపూర్: కేశవపట్నం మహిళా మోడల్, పొరండ్ల పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

- గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ చర్యలు

తిమ్మాపూర్, నవంబర్ 29: మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు పోలీసు బందోబస్తుతో చేరుకున్నారు. నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 2,18,413 మంది ఓటర్లు ఉన్నారు. తిమ్మాపూర్ మండలంలోని రామ కృష్ణ కాలనీ గ్రామంలో మహిళలకు, పొరండ్లలో దివ్యాంగులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే పర్లపల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని నెలకొల్పారు. ఎన్నికలు సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ సిబ్బంది పెద్ద మొత్తంలో గ్రామాలకు చేరుకున్నారు. మండలం లోని 23 గ్రామాలకు గానూ 57 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 41,388 మంది ఉండగా.. ఇందులో 20,161 మంది పురుషులు కాగా, 21,227 మంది మహిళలు.

***మానకొండూర్‌లో..***

మానకొండూర్/ మానకొండూర్ రూరల్, నవంబర్ 29: నియోజకవర్గంలో పోలింగ్‌కు ఎన్నికల అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పూర్తిచేశారు. మండల వ్యాప్తంగా 78 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపులు, మంచి నీటి సౌకర్యం కల్పించి, వీల్‌చైర్లను అందుబాటులో ఉంచారు. మానకొండూర్ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్‌కేంద్రంలో మహిళా కేంద్రం, ముంజంపల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రం, మద్దికుంటలో యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈమూడు కేంద్రాలను ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

***శంకరపట్నంలో..***

శంకరపట్నం, నవంబర్ 29: నేడు జరుగనున్న పోలింగ్‌కు శంకరపట్నం మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పీవో, ఏపీవో, వోపీవోలతో పాటు బీఎల్‌వోలు పోలింగ్ నిర్వహణకు కంపార్టుమెంట్స్, తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 52 పోలింగ్ బూత్‌లు ఉండగా, 18505 మంది పురుష ఓటర్లు, 18711 మంది మహిళా ఓటర్లు, మొత్తం 37216 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా, కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో అత్యధిక మహిళా ఓటర్లు గల 108 పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా మహిళా మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. మండలంలో హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో 120 మంది బీఎస్ఎఫ్, ఏపీ రాష్ట్ర పోలీసులతో పాటు స్థానిక పోలీసులు ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహిస్తున్నారు. 8 సమస్యాత్మక గ్రామాలను పోలీసులు గుర్తించి ప్రత్యేక బలగాలను నియమించినట్లు సీఐ సంతోష్‌కుమార్ వెల్లడించారు.

**ఇల్లంతకుంటలో..**

ఇల్లంతకుంట, నవంబర్ 29: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేశామని ఎంపీడీవో మీర్జా బుధవారం తెలిపారు. మండలంలో 29 పోలింగ్ కేంద్రాలు, 58 బూత్‌లు ఉండగా 140 మంది ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. మండలంలో 48 వేల ఓటర్లు ఉన్నారని తెలిపారు. అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి



హుజూరాబాద్ టౌన్: డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్29: ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు కీలకమైనదని, కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి సిబ్బందికి సూచించారు. హుజూరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల విధుల కోసం కేటాయించిన పోలీస్ అధికారులు, సిబ్బందితో బుధవారం విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బందికి కేటాయించిన విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రారంభమయ్యే సమయం కంటే గంట ముందుగానే విధులకు సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ బూత్ వద్ద ఇతర శాఖల సిబ్బందితో సమన్వయంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ బూత్ వద్ద విధుల్లో ఉండే సిబ్బంది సంబంధిత రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే ఏదైనా సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. స్థానిక ప్రజలు, ఓటర్లతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రవర్తనతో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ బూత్‌లోకి అనుమతి లేని పరికరాలు, వస్తువులను ఓటర్లు పోలింగ్ బూత్‌లోనికి తీసుకెళ్లకుండా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగే విధంగా విధులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఏసీపీ లక్కిరెడ్డి జీవన్‌రెడ్డి, బీఎస్ఎఫ్ అధికారులు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సీపీ**

వీణవంక, నవంబర్ 29: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని బుధవారం రాత్రి కరీంగనర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి ఆకస్మికంగా సందర్శించారు.ఎన్నికల సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెల్సుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్ఐ ఆసిఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ పైలం

- బైండోవర్ అయ్యారా..? జాగ్రత్త
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ చర్యలు
- ఇప్పటికే తహసీల్దార్ ఎదుట వందల మంది హాజరు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

తిమ్మాపూర్, నవంబర్ 29: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడడం ఎన్నికల కమిషన్ విధి. ఎవరైనా ఈ ప్రక్రియకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే కేసులు కూడా నమోదు చేస్తుంది. గొడవలకు కారణమయ్యే నేరస్వభావం ఉన్న వారిని బైండోవర్ చేయిస్తుండగా, దీనిని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటుంది.

తిమ్మాపూర్ మండలం గొడవలు, కక్షలకు తావు లేకుండా ఉన్నప్పటికీ ఎల్ఎండీ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు వేర్వేరుగా అన్ని పార్టీలకు చెందిన పలువురు లీడర్లు, నేరస్వభావం ఉన్నవారు, రౌడీషీటర్లు, బెల్ట్‌షాప్ నిర్వాహకులను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని సెక్షన్ 107కింద బైండోవర్ చేశారు. ఇప్పటి వరకు తిమ్మాపూర్ మండలంలో పోలీస్ శాఖ తరపున 327, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 130మందిని బైండోవర్ చేశారు.

**ముందస్తు అస్త్రం:** ఎవరైనా వ్యక్తులతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఈ బైండోవర్ అస్త్రాన్ని ఉపయోగిస్తారు. బైండోవర్ కేసు నమోదైన వారు ఆరు నెలల్లోపు ఏదేనా కేసులో ఇరుకున్నా, వారిపై కేసు నమోదైనా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారికి ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధిస్తారు. కొన్నిసార్లు తహసీల్దార్ విచక్షణాధికారం ఉండే అవకాశం కూడా ఉంది. తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పొనగంటి అజయ్ ఒక నేరంలో నిందితుడిగా ఉన్నాడు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇటీవల అతడిని ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి.. తహసీల్దార్ కనకయ్య ఎదుట బైండోవర్ చేశారు. ఈ క్రమంలో అజయ్ అక్టోబర్31న మరో నేరం చేయగా, ఎస్ఐ ప్రమోద్ రెడ్డి అరెస్ట్ చేసి, బైండోవర్ కేసు ఉన్నందున ఆయన నేర చరిత్రను వివరిస్తూ తహసీల్దార్ కనకయ్య ముందు ప్రవేశపెట్టారు. దీంతో అతడి నేర చరిత్రను పరిశీలించిన తహసీల్దార్, ఆరు నెలల జైలుశిక్ష లేదా, రూ.లక్ష జరిమాన చెల్లించాలని ఉత్తర్వులు అందజేశారు. దీంతో పొనగంటి అజయ్ రూ.లక్ష జరిమానాను బుధవారం చెల్లించాడు.

***ప్రశాంత వాతావరణం కోసమే: శీలం ప్రమోద్‌రెడ్డి, ఎస్ఐ, ఎల్ఎండీ***

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నేర చరిత్ర ఉన్నవారిని బైండోవర్ చేశాం. బైండోవర్ అయిన వాళ్లు ఏదైనా నేరం చేస్తే శిక్ష లేదా జరిమానా తప్పదు. శాంతిభద్రతలకు భంగం కలిగించిన ఎవరిపైనైనా కేసులు నమోదు చేస్తాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలి.

## బాధిత కుటుంబానికి ప్రముఖుల పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, జీవీఆర్

మానకొండూర్ రూరల్, నవంబర్ 29: మండలంలోని ముంజంపల్లి గ్రామ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి మామ ఉమ్మెంతల నర్సింహారెడ్డి (94) బుధవారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరి వెంట కాసం బ్రహ్మారెడ్డి, నందగిరి మల్లయ్య, గాజర్ల మల్లారెడ్డి, బత్తిని సాగర్, బాలెంకి మల్లేశం, శివ, గుండ్ల కిష్టస్వామి, కొత్త వెంకట రెడ్డి, భూంరెడ్డి, మల్లికార్జున్ గౌడ్, కాసం రాజగోపాల్ రెడ్డి, నాగపూరి మల్లేశం తదితరులున్నారు.

## తెలంగాణ అమరవీరులకు ఘన నివాళి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 29: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్‌ను పురస్కరించుకుని తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలు చల్లి, అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. జై తెలంగాణ, జై జై తెలంగాణ, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ తదితరులు